క్లుప్తంగా

లడ్డూల వేలం

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన అయ్యప్ప స్వామి అంబళ్లపూజలో ఏర్పాటు చేసిన లడ్డూలను ఆదివారం వేలం నిర్వహించారు. వినాయక స్వామి లడ్డూను రూ.30 వేలకు జయమూర్తిరెడ్డి, అయ్యప్ప స్వామి లడ్డూను రూ.37,000కు అశోక్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం స్వామి లడ్డూను రూ.21,000కు తన్నీరు సుబ్రహ్మణ్యం దక్కించుకున్నారు. ఇంకా అయ్యప్పకు వేసిన మాలను రూ.5 వేలు, వినాయకస్వామి మాలను రూ.2 వేలు, వెంకటేశ్వరస్వామి మాలను రూ.4 వేలు, శివమాలను రూ.5 వేలు, లక్ష్మి అమ్మవారి మాలను రూ.3 వేలు, అయ్యప్ప అభిషేకం మాలను రూ.2 వేలకు భక్తులు దక్కించుకున్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం



ముత్తుకూరు: మండలంలోని తాళ్లపూడి సాయి బాబా మందిరంలో నెలరోజులపాటు అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి దీనిని నిర్వహించారు. దీక్షలో ఉన్న సుమారు 300 మంది భక్తులకు రోజూ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు నిత్యం హాజరయ్యారు.

ఘనంగా హిందూ సమ్మేళనం



మాట్లాడుతున్న వక్తలు

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక ఎస్ఎస్ కల్యాణ మండపంలో హిందూ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజరాజేశ్వరి పీఠానికి చెందిన స్వామి పాల్గొని ప్రసంగించారు. ధర్మ పరిరక్షణకు పాటుపడాలన్నారు. యుగంధర్ మాట్లాడుతూ మన దీక్ష – దేవాలయ రక్ష అనే నినాదంతో జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే సమ్మేళనంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వరినాట్లకు ఆటంకంగా వర్షాలు



వరినాట్లు వేస్తున్న కూలీలు

పొదలకూరు: గ్రామాల్లో ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. అయితే మూడురోజులుగా జడివానలు కారణంగా ఈ పనికి ఆటంకంగా మారాయి. ఇప్పటికే డెల్టా గ్రామాలైన తాటిపర్తి, మహ్మదాపురం, విరువూరు, సూరాయపాళెం, వెలికంటిపాళెం, యర్రబల్లి, నేదురుమల్లి, నల్లపాళెం గ్రామాల్లో 50 నాట్లను శాతం పూర్తి చేశారు. మిగిలిన నాన్ డెల్టా గ్రామాల్లో ఇప్పుడిప్పుడే ప్రారంభించారు. అయితే తుఫాన్ ప్రభావంతో వాన పడుతూనే ఉండడం రైతులకు ఇబ్బందిగా ఉంది. ముందుగా నార్లు పోసుకున్న అన్నదాతలు ఆలస్యమైతే నారు ముదిరిపోతుందని ఆందోళన చెందుతున్నారు. వారం, పదిరోజుల క్రితం నార్లు పోసుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేకున్నా నానుడు వర్షం కురిస్తే నారుమడులు దెబ్బతింటాయంటున్నారు. వర్షం లేకుంటే కొన్ని గ్రామాల్లో నాట్లు పూర్తయ్యేవి.

ఎకరా నాటుకు రూ.5 వేలు

వ్యవసాయ ఖర్చు ప్రతి ఏడాది పెరుగుతూనే ఉన్నాయి. గతేడాది పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలు నాటుకు ఎకరాలకు రూ.4 వేల నుంచి రూ.4,500 తీసుకుంటే రబీ నాటుకు ఏకంగా ఆ మొత్తాన్ని రూ.5 వేలకు పెంచారని రైతులు తెలిపారు. అయితే నారు కట్టలు వారే మాగాణిలో వేసుకుంటే ఒక రకంగా లేదంటే మరో రకంగా కూలీలు తీసుకుంటున్నారు.

ఆకాశదీప నిమజ్జనోత్సవం నేడు

పొదలకూరు: కార్తీక మాసం సందర్భంగా నెల రోజులపాటు పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన ఆకాశదీపం నిమజ్జనోత్సవాన్ని సోమవారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఆలయం నుంచి మేళతాళాల నడుమ మండలంలోని దేగపూడి కండ్లేరు ఏటి కాలువలో నిమజ్జనం చేస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాల్సిందిగా కోరారు.
– పట్టణంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన ఆకాశదీపం నిమజ్జనోత్సవం సోమవారం సాయంత్రం జరుగుతుందని ప్రధానార్చకులు ప్రసాద్‌స్వామి తెలిపారు. అత్యంత వైభవంగా ప్రత్యేకాలంకరణతో నిమజ్జనోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

కొడవలూరు సాగునీటి కాలువ దుస్థితి



ఆనవాళ్లు కోల్పోయిన గుండాలమ్మపాళెం కాలువ



రైతులే పూడిక తీసుకున్న చిన్న కాలువ



బ్రాంచ్ కాలువలిలా.. సాగేదెలా?

ఇరిగేషన్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో పంటలకు సాగునీరు అందే పరిస్థితి లేకుండా పోతోంది. సాధారణంగా ప్రధాన సాగునీటి కాలువల నుంచి చిన్న కాలువ (బ్రాంచ్ కాలువలు)ల ద్వారా పొలాలకు నీరు అందుతుంది. అయితే అధికారులు ప్రధాన కాలువల్లో పూడిక తీసి చిన్న కాలువలను వదిలేశారు. ఫలితంగా చిన్న కాలువలు పూడికతో నిండిపోయి నీరు పారే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

- పూడికతో నిండి ఉన్న చిన్న కాలువలు
- రెండు వేల ఎకరాల ఆయకట్టున్నా పట్టించుకోని వైనం
- నీరందక రైతుల ఆందోళన
- చిన్న కాలువల పూడికతీత కుదరదంటున్న అధికారులు



పూడికకు నోచుకోని దామేగుంట కాలువ

కొడవలూరు : మండలంలో తూర్పు కాలువ ప్రధాన సాగునీటి వనరుగా ఉంది. కనిగిరి రిజర్వాయర్ నుంచి ఈ కాలువ ద్వారా కొడవలూరు, విడవలూరు మండలాల్లో 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందాల్సి ఉంది. ఒక్క కొడవలూరు మండలంలోనే 20 వేల ఎకరాలకు సాగు నీరందాలి. అయితే ఈ ఆయకట్టుకు నేరుగా ప్రధాన కాలువ నుంచి కాక చిన్న కాలువల ద్వారా సాగు నీరందిస్తారు. కొడవలూరు మండలంలో ప్రధానమైన తూర్పు కాలువ నుంచి తలమంచి, దామేగుంట కాలువలు ఎక్కువ ఆయకట్టు కలిగి ఉన్నాయి. తలమంచి కాలువ 5 వేల ఎకరాలకుపైగా సాగు నీరందిస్తుండగా, దామేగుంట కాలువ 2 వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగు నీరందిస్తుంది. ఈ కాలువలు కూడా నేరుగా కాకుండా చిన్న కాలువల ద్వారానే ఆయకట్టుకు నీళ్లందిస్తాయి.

దామేగుంట కాలువ దుర్భరం

దామేగుంట కాలువ కింద 2 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నప్పటికీ కాలువ పూడికతీత చేపట్టలేదు. ఈ కాలువ తూటాకు, పచ్చికతో నిండి ఆనవాళ్లు కోల్పోయి చుక్కనీరు ముందుకు సాగడం లేదు. ఈ కాలువనే నమ్ముకున్న దామేగుంట, వెంకన్నపురం, బసవాయపాళెం, గుండాలమ్మపాళెం, పద్మనాభసత్రం రైతులు సాగు నీరందక అల్లాడిపోతున్నారు. కాలువల ద్వారా నీటి విడుదల ఉన్నప్పటికీ బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

తలమంచి కాలువ పరిధిలో..

తలమంచి కాలువ కింద 5 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండడంతో రైతుల విజ్ఞప్తుల నేపథ్యంలో కాస్త ఆలస్యంగా కాలువ పూడికతీత ప్రారంభించారు. ఈ కాలువ కింద కాంగ్రెస్ కాలువ, ఈర్లమిట్ట తూము కాలువ, సీ కాలువ, వరదారెడ్డి తూము చిన్న కాలువలుగా ఉన్నప్పటికీ వెయ్యి ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తాయి. వీటినీ అధికారులు పట్టించుకోలేదు. తూర్పు కాలువ నుంచి చీలి కొడవలూరు పరిధిలోని 430 ఎకరాల ఆయకట్టుకు నీరందించే కొడవలూరు కాలువ పూడికతో నిండి పచ్చిక బయళ్లను తలపిస్తోంది. దీనివైపు కన్నెత్తి చూసిన వారు లేరు. తలమంచిలోని ఆయకట్టు చివరిది కావడంతో కాలువల దుస్థితి దృష్ట్యా నీరందవన్న ఆందోళనతో పిల్ల కాలువలను రైతులే సొంతంగా తవ్వుకున్నారు.

దామేగుంట, తలమంచి, కొడవలూరు, గుండాలమ్మపాళెం, వెంకన్నపురం, బసవాయపాళెం తదితర గ్రామాల రైతులు చిన్న కాలువల పూడికతీత చేయాలని ఇరిగేషన్ అధికారులను పలు పర్యాయాలు కోరినప్పటికీ పెద్ద కాలువలకు మాత్రమే పూడికతీత ఉంటుందని తేల్చి చెప్పినట్లు రైతులు తెలిపారు. అవసరమైతే రైతులే సొంతగా తీసుకోవాలని సూచించినట్లు వాపోయారు.

చుక్కనీరందితే ఒట్టు



దామేగుంట కాలువ కింద మా గ్రామంలోనే 630 ఎకరాల ఆయకట్టు ఉంది. దామేగుంట కాలువ పూడిక తీయకపోవడం వల్ల చుక్క నీరందడం లేదు. దీంతో బోర్లను నమ్ముకోవాల్సి వచ్చింది. కేవలం పెద్ద కాలువలు మాత్రమే పూడిక తీయడం వల్ల ప్రయోజనం ఉండదు. చిన్న కాలువల్లో పూడిక తీస్తే రైతులందరికీ సాగు నీరందుతాయి.

– కందనగోళ్ల వెంకటేశ్వర్లు, రైతు, దామేగుంట

అధికారులకే చిత్తశుద్ధి లేదు



రైతుల సమస్యల పట్ల ఇరిగేషన్ అధికారులకే చిత్తశుద్ధి లేకుండా పోయింది. కాలువలు పూడిక తీయాలని ఎన్ని పర్యాయాలు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. కేవలం ప్రధాన కాలువలు మినహా చిన్న కాలువల పూడికతీత జరగదని తేల్చి చెబుతున్నారు. సమస్యను దాట వేస్తున్నారే తప్ప రైతుల గోడు అధికారులకు పట్టడం లేదు. స్థానిక ఎమ్మెల్యే పరిష్కరించాలని విన్నవించుకుంటున్నా.

– కొట్టే మల్లికార్జున, రైతు, దామేగుంట

పూడిక తీసుకుంటున్నాం



చిన్న కాలువల పూడికను తీయకపోవడం వల్ల మాకు సాగు నీరందలేదు. దీంతో పంట వదులుకోవాల్సి వస్తుందని భావించి రైతులంతా కలిసి భాగస్వామ్యంతో ఆయకట్టుకు నీరందించే కాలువల పూడిక తీసుకున్నాం. చిన్న కాలువల విషయమై ఇరిగేషన్ అధికారులను అనేక పర్యాయాలు మొర పెట్టుకుని ప్రయోజనం లేనందువల్లే సొంతంగా తీసుకున్నాం. అయినప్పటికీ పైభాగాన కాలువల దుస్థితి వల్ల సమృద్ధిగా సాగు నీరందడం కష్టతరమే.

– కలిశెట్టి వెంకయ్య, రైతు, తలమంచి

మైపాడు బీచ్‌లో కోలాహలం



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఇందుకూరుపేట: కార్తీక మాసం చివరిరోజును పురస్కరించుకుని ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు బీచ్‌లో భక్తులు ఆదివారం పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రతికూల వాతావరణంతో కడలి కల్లోలంగా ఉన్నా జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచ్‌కు చేసుకున్నారు. పుణ్యస్నానాలు చేసి తీరం వెంబడి ఉన్న శివాలయంలో పూజలు చేశారు.

వ్యాసరచన పోటీలో ఏకలవ్య విద్యార్థి ప్రతిభ

కొడవలూరు: గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా జీవిత చరిత్రపై గత నెల 24న నెల్లూరులోని గుర్రం బాబయ్య కల్యాణ మండపంలో జిల్లాస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలోని ఏకలవ్య (ఈఎంఆర్) స్కూల్ పదో తరగతి విద్యార్థి దేవరకొండ కార్తీక్ మొదటి బహుమతి గెలుచుకున్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన కార్తీక్‌కు నగర మేయర్ స్రవంతి, ఐటీడీఏ మాజీ పీఓ వై.వెంకటేశ్వర్లు, జాతీయ గిరిజన సమాఖ్య అధ్యక్షుడు పులి చెంచయ్యల చేతుల మీదుగా ఆదివారం రూ.10 వేల నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి కార్తీక్‌ను ఏకలవ్య స్కూల్ ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ ఆదివారం ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల నైపుణ్యం, సృజనాత్మకత వెలుగులోకి వస్తాయన్నారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న కార్తీక్

ఏకగ్రీవంగా అసోసియేషన్ ఎన్నిక



విడవలూరు: గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విడవలూరులోని పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ వి.శ్రీరామమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరులోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన ఎన్నిక ప్రక్రియలో అసోసియేషన్ సెక్రటరీగా ఎస్.రామాంజనేయులు, మహిళా సెక్రటరీగా తమన్నా, ట్రెజరర్‌గా డి.మనోజ్‌ప్రభాకర్ నియమితులయ్యారు. ఏవీ రమణరావు, కిరణ్, వెంకట్రావు పరిశీలకులుగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరం నవాబుపేట ప్రాంతానికి చెందిన రమణమూర్తి పని నిమిత్తం బైక్‌పై గూడూరుకు వెళ్తున్నాడు. కాకుటూరు సమీపంలో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో రమణమూర్తికి గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్షం.. తీరని కష్టం



నరుకూరు – తోటపల్లిగూడూరు రహదారి ఇలా..



తోటపల్లిగూడూరు: కోడూరులో ఎగసిపడుతున్న అలలు

తోటపల్లిగూడూరు: వర్షాల కారణంగా మండల తీరప్రాంతం గజగజ వణికింది. తుఫాన్ తీరం దాటినా కుండపోతోపాటు ఈదురుగాలులు వీయడంతో జనజీవనం స్తంభించింది. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న ఈ భారీ వర్షాలు ఆదివారం ఉదయం కాస్త ఆగినా మళ్లీ కురిశాయి. చలితీవ్రత అధికం కావడంతో తీరప్రాంత పంచాయతీలైన కోడూరు, వెంకన్నపాళెం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు లోతట్టు గ్రామాలు, రహదారులు ముంపునకు గురయ్యాయి. రవీంద్రపురం పట్టపుపాళెం గిరిజన కాలనీ వాసులకు రెవెన్యూ అధికారులు బియ్యం, పప్పులు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

వర్షపాతం

ముత్తుకూరు: సముద్రతీర ప్రాంతమైన మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. తుఫాన్ తీరం దాటినా దాని ప్రభావంతో దట్టమైన మేఘాలతో వర్షం కొనసాగింది. ఆదివారం ఉదయానికి మండలంలో 79.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- ఇందుకూరుపేట : మండలంలో ఆదివారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమైంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు అవస్థలు ఎదుర్కొన్నారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రగతి చారిటీ బధిర పాఠశాల నుంచి అదృశ్యమైన ఏడో తరగతి విద్యార్థిని కారుణ్య ఆచూకీ లభ్యమైంది. బోగోలు మండలానికి చెందిన బాలికను శనివారం సాయంత్రం ఆమె తల్లి వసతి గృహంలో వదిలి వెళ్లింది. అర్ధరాత్రి కారుణ్య గేటు దూకి వెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక తల్లి కూలి పనుల నిమిత్తం బాపట్ల జిల్లాలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కారుణ్య అక్కడికి వెళ్లినట్లు ఆమె బాబాయ్ జాలయ్య ఆదివారం వెల్లడించారు.

తుఫాన్ షెల్టర్ల నిర్వహణ గాలికి..

ముత్తుకూరు: తుఫాన్ల సమయంలో సముద్రతీర ప్రాంత వాసులు, లోతట్టు పేదలకు సురక్షితమైన ఆశ్రయం ఇచ్చేందుకు నిర్మించిన షెల్టర్లపై పర్యవేక్షణ కరువైంది. ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో శిథిలమైపోతున్నాయి. విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. వర్షాల సమయంలో తప్ప మిగిలిన వేళలో అటువైపు చూడకపోవడంతో భవనాలు దిష్టిబొమ్మల్లా మారిపోయాయి.

పట్టించుకోకపోవడంతో..

మండలంలోని దొరువులపాళెంలో రూ.కోటికిపైగా నిధులతో నిర్మించిన ఆధునిక తుఫాన్ షెల్టర్‌లో మొన్నటి వరకు సచివాలయాన్ని నిర్వహించారు. దీనికి సొంత భవనం ఏర్పడిన తర్వాత షెల్టర్‌ను గాలికొదిలేశారు. అలాగే, కృష్ణపట్నం, చలివేంద్ర గ్రామాల్లోని భవనాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ముసునూరువారిపాళెం, గోపాలపురం, బండ్లపాళెం, నేలటూరు పట్టపుపాళెం, ఈపూరు, మల్లూరు, పల్లెపాడుదిబ్బ, ఆముదాలపాడు తదితర గ్రామాల్లోని షెల్టర్లు ప్రజా వినియోగానికి దూరమవుతున్నాయి. కొన్ని మాత్రం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఉపయోగంగా ఉన్నాయి. బలిజపాళెం భవనం సచివాలయంగా మారింది. అధిక సంఖ్యలో షెల్టర్లపై పర్యవేక్షణ లేకపోవడంతో భవనాల్లో విడి భాగాలు అదృశ్యమవుతున్నాయి. కొన్ని జూద కేంద్రాలుగా మారిపోయాయి.



ముసునూరువారిపాళెంలోని షెల్టర్

కిటికీలు, తలుపులు ధ్వంసం



ప్రపంచ బ్యాంక్ నిధులతో వెంకన్నపాళెంలో నిర్మించిన ఆధునిక షెల్టర్‌లో తలుపులు విరిగిపోయాయి. కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. అడపాదడపా పొదుపు సంఘాలు వినియోగించుకుంటున్నా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ అవసరం.

– టి.సుబ్బరాయడు, ఈపూరు వెంకన్నపాళెం

వినియోగంలోకి తీసుకురావాలి



మల్లూరులోని షెల్టర్‌లో మొన్నటి వరకు సచివాలయాన్ని నడిపారు. సొంత భవనం ఏర్పడిన తర్వాత దీనిని విస్మరించారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రం నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో రిపేర్లు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– రంగనాథ్, మల్లూరు

వసతులు కల్పించాలి



ఈపూరులోని తుఫాన్ షెల్టర్ క్రమంగా శిథిలమవుతోంది. ప్రస్తుతం ఈ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. అయితే వర్షాలకు ఇది ఉరుస్తోంది. రిపేర్లు చేసి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.

– తైదుపాటి వీరరాఘవయ్య, మాజీ సర్పంచ్



దారుణంగా బీసీ కాలనీ రోడ్డు

రోడ్లు గుల్ల

వర్షాలకు మండలంలోని పలు రోడ్లు గుల్ల గుల్లయ్యాయి. ముఖ్యంగా ముత్తుకూరు నుంచి మామిడిపూడికి వెళ్లే రోడ్డు బీసీ కాలనీ పొడవునా దొరువులా మారింది. అలాగే జెన్‌కో ప్రాజెక్ట్ నుంచి నేలటూరుకు వెళ్లే రోడ్డు, పట్టపుపాళెం రోడ్డు, మిట్టపాళెం రోడ్డు దారుణంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మామిడిపూడి నుంచి ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌కు వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా మారింది. – ముత్తుకూరు